# శ్రీరామ్‌పురం

- డి.వి.వి. ముత్యాలు

పద్దెనిమిది సంవత్సరాల తర్వాత తిరిగి స్వంత ఊరికి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాం. మావారు జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వడానికని ఆఫీసుకు వెళ్ళారు. మాధవిని ఇక్కడ కొత్త స్కూల్లో జాయిన్ చెయ్యడానికని, కూడా తీసుకువెళ్ళారు. నేను లేచి పనుల్లో చొరబడి పోయాను. పనులన్నీ పూర్తయ్యేసరికి మధ్యాహ్నం మూడయింది.

తలుపు తట్టిన శబ్దమైతే వెళ్ళి తీశాను. నా ఆశ్చర్యానికి అవధుల్లేక పోయాయి. ఎదురుగా నారాయణ పడాల్ గారు. ఆనందం ఎక్కువైనపుడు ఏదీ గుర్తుకు రాదనుకుంటాను. ముందుగా ఆయనే కళ్ళు తుడుచు కుని నా తలనిమిరి "పిచ్చిపిల్ల, లోపలికి రానీయవా నన్ను" అంటూ నవ్వారు. నేను కూడా కళ్ళు తుడుచుకుని ఆయన్ని లోపలికి తీసుకువచ్చాను.

నా చిన్ననాటి సంగతులు జ్ఞాపకాల పొరల్ని చీల్చుకుని దూసుకు వస్తున్నాయి. నాకు తండ్రి తరువాత తండ్రి లాంటివారు నారాయణ పడాల్. నన్ను భుజాల మీద పెట్టుకుని ఆడించేవారు. అప్పుడే తీసిన పుట్టతే నెను నా కోసం ప్రత్యేకంగా తెచ్చేవారు. ఇక సంతలు జరిగినపుడు చెప్పనే అక్కర లేదు. కడియాలు, పలకల గొలుసులు, గాజులు.. ఇంకా, బిరుసుగా ఉండే శిరోజాలకు వాసన నూనె అంటూ మొదట నా గూడెంలో వాడింది నేనే. తెచ్చింది ఆయనే.. ప్రతివారికి చిన్నతనం చాలా సంతోషంగానే ఉంటుంది కదా. తరువాత కూడా విచారించేందుకు ఏముంది. అపురూపంగా చూసుకునే భర్త, ముచ్చటైన ఇద్దరు పిల్లలు, పెద్దవాడు మురళి, చిన్నది మాధవి. ఇరవై సంవత్సరాల దాంపత్య జీవితం ముందు వైజాగ్‌లో మొదలై తర్వాత ఆగ్రా కొండల్లో ముంచి ఇదిగో ఇవాళ వైజాగ్‌లో దించింది.

సాయంత్రం మావారు పెందరాళే వచ్చారు. వారి వెనుక మాధవితో పాటు మురళి కూడా వచ్చాడు. "సులువుగా ఇల్లు కనుక్కోగలిగారా!" అన్నారు పడాల్‌గారితో.

"అదేమిటి? ఆయన వచ్చినట్లు మీకెలా తెలుసు" అన్నాను ఆశ్చర్యంగా. దానికి జవాబు పడాల్ గారి దగ్గర నుంచి వచ్చింది. "నాకు పనున్నది అల్లుడిగారి ఆఫీసులోనే నమ్మా! ఈయన అక్కడ కనిపించి విషయం చెప్పారు. నా పని కూడా పూర్తిచేసేశారు. ఈ అబ్బాయి..." అంటూ ప్రశార్థకంగా మురళివైపు చూశారు.

"వీడు మా పెద్దవాడు మురళి. బి.ఎ చదువుతున్నాడు. ఇది చిన్నది మాధవి. ఈ సంవత్సరం స్కూల్ ఫైనల్ రాస్తుంది" అన్నారు మావారు.

రాత్రి భోజనాల దగ్గర మా పిల్లలు కూడా బాబాయికి బాగా చనువయ్యారు. మురళి సర్టిఫికెట్స్ తీసుకోవడం కోసమని చెప్పి ఒకరోజు లేటుగా ఉండి ఈ రోజు వచ్చాడు. మురళి తన ప్రయాణంలోని అనుభవాలు చెప్పి నవ్వించడం మొదలుపెట్టాడు. మాధవి ఆ రోజు వడ్డన బాధ్యత తీసుకుంది. మాధవిది అంతా నా పోలికే. అది కొసరి కొసరి వడ్డిస్తుంటే పడాల్‌గారు ఆనందాన్ని దాచుకోలేక పోయారు. "నాకివాళ ఎంత ఆనందంగా ఉందో తెలుసా అల్లుడూ. మన మాధవిని చూస్తుంటే ఇరవై సంవత్సరాల క్రితం నాతో కలిసి ఉన్న మా బాసంతి గుర్తుకు వస్తోంది. ఆ మాటకొస్తే నేను దీనంతటికీ కృతజ్ఞత చెప్పుకోవలసి వస్తే నీకు ముందుగా చెప్పుకోవాలి. ఇరవై సంవత్సరాల క్రితం మేము ఇప్పుడు అనుభవిస్తున్న జీవితాన్ని ఊహించ లేము. మా ఊరు మొత్తం నీకు ఋణపడి ఉంది. నువ్వు నాటిన విజ్ఞాన విత్తనాలు ఈ రోజు మహా వృక్షాలై మధుర ఫలాలనందిస్తున్నాయి. నీకు తెలుసా? ఈ నారాయణ పడాల్ నిశానీ గాడు.. ఈ వయస్సులో మెట్రిక్యులేషన్ పాసయ్యాడు. నేను నీకు వంగి పాదాలకు నమస్కారం చెయ్యలేకపోవచ్చు. కాని మా మనసుల్లో ఎప్పుడూ నిన్ను పూజిస్తూనే ఉంటాము" అయన కళ్ళ వెంట నీరు కారుతుంటే ఉద్రేకంగా మధ్యమధ్యలో ఆయాసపడుతూ చెప్పుకు పోతున్నారు.

ఈ సంఘటన ఊహించలేనిదేమో, అంతా నిశ్శబ్దమై పోయాము. ముందుగా మా వారే తేరుకున్నారు. రాత్రి అందరివీ పక్కలు డాబా మీద వేసుకున్నాం. నాకు నిద్ర పట్టలేదు. బాబాయిగారప్పుడే గాఢనిద్రలో ఉన్నారు. మురళి, మాధవి కూడా నిద్ర పోయినట్టున్నారు. చిన్నతనం అంతా గుర్తుకు వచ్చి నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. మా వారి వైపు చూశాను. ఆయన కూడా నా వైపే చూస్తున్నారు. నేను చూడగానే మధురంగా నవ్వారు.

"నిద్ర రావటం లేదా?" అన్నారు.

నేను లేదన్నట్లుగా పెదవి విరిచి "మరి మీకు" అన్నాను.

"చూస్తున్నావుగా అవస్థ" అంటూ లేచి గోడకు జారగిలబడి కూర్చున్నారు. నేను లేద్దామనుకుంటుండగా "డాడీ! నాకూ నిద్ర రావడం లేదు" అంటూ దగ్గరకు వచ్చారు మాధవి, మురళి.

మాకు తెలుసు వాళ్ళకి నిద్ర పట్టదు అని. ఆయనకు ఇరువైపులా మాధవి, మురళి కూచున్నారు. ఎదురుగా నేను కూర్చున్నాను. మేం ఎప్పుడో నాటిన కొబ్బరి మొక్కలు మా అత్తగారి చేతుల్లో శ్రద్ధగా పెరిగి, గాలికి మెల్లగా కదులుతూ, చనిపోయిన ఆవిడను, జ్ఞాపకం చేస్తున్నాయి. కొబ్బరి ఆకుల సందుల్లోంచి 'చతుర్థి చంద్రుడు' వెన్నెల వెలుగుల్ని విరజిమ్ముతున్నాడు.

సభ్యతా, సంస్కారాలలో మా పిల్లలు అచ్చు మా ఆయన పోలికే. ముందుగా మురళి అడిగాడు. "డాడీ, ఇఫ్ యు ఆర్ ఇన్ మూడ్, నేను మిమ్మల్నొక విషయం అడగొచ్చా" అన్నాడు. మాధవి కూడా ఆసక్తిగా చూసింది. ఆయన "నాకు తెలుసు, మీలో సాయంత్రం నుంచి క్యూరియాసిటీ పెరిగిపోతోందని. ఆయన గురించేగా మీరడగబోయేది. అది చెప్పాలంటే ముందు నా గురించి చెప్పాలి" అంటూ ఆయన ఒక్కసారి కళ్ళు మూసుకుని జ్ఞాపకాల పుటల్లోంచి చెప్పసాగారు.

"నేను పుట్టింది, పెరిగింది ఈ ఇంట్లోనే. హుషారైన చిన్నతనం, చురుకైన చదువు నన్ను డిగ్రీకి చేర్చాయి." అని ఒక్కసారి సాలోచనగా ఆగి, "ఒక్కోసారి మనం ఎవరివల్ల, ఎందుకు ప్రభావితం అవుతామో చెప్పలేము. అసలది మనకు తెలియదు కూడాను. అది అలా జరిగిపోతుందంతే. నేను డిగ్రీ చదివే రోజుల్లో, 'డేవిడ్' అనే ఎకనామిక్స్ లెక్చరర్ కొత్తగా వచ్చారు. ఈ వీధిలోనే ఇల్లు తీసుకున్నారు. రెండువారాలు గడిచిన తరువాత చూస్తే ఎప్పుడూ సాయంత్రం ఎక్కడెక్కడి జనాలతోనో ఆ ఇంటి అరుగులు నిండి ఉండేవి. ఒకరోజు ఆ ఇంటి నుండి వస్తున్న వ్యక్తినిఆపి విషయం అడిగాను. ఆయన పది నిమిషాలపాటు నాకు చెప్పిన విషయాలకు సారాంశమేమిటంటే, మా లెక్చరర్ గారు వీరికి దీన బంధువు. ఆయన వీరికి ఉచితంగా చదువు, తనకు తెలిసిన వైద్యమే గాకుండా, వీళ్ళ సాధక బాధకాలకు తరుణోపాయాలు చెబుతూ ఉంటారు.

నాలో కుతూహలం పెరిగింది. ఆ మరుసటి రోజు ఆయన కాలేజీలో కనిపించినపుడు విష్ చేశాను. ఆయన మందహాసం చేసి నవ్వుకుంటూ వెళ్ళిపోయారు. మర్నాడు నేను వారింటికి వెళ్ళాను. ఒంటరి జీవితమే. చాలా సాధారణంగా ఉంది ఇల్లు. నాకు మా హిస్టరీ లెక్చరరుగారి డ్రాయింగ్ హాలు గుర్తుకు వచ్చింది. కొద్ది సేపటికి ఆయన లోపలినుంచి వచ్చి నన్ను పలకరించారు. కొద్దిసేపు బిడియపడ్డాను గాని, ఆయనతో మాట్లాడుతున్నంత సేపూ నన్ను నేను మరిచిపోయాను. ఆయనవి చాలా ఉదాత్తమైన భావాలు. నేను ఆయన పట్ల ఆకర్షితుడ్నయ్యాను. ఆయనతో పాటుగా మురికివాడల్లో చదువు చెప్పేవాడిని. ఆరోగ్యం, పరిశుభ్రత వలన ఉపయోగాలు చెప్పేవాళ్ళం. ఇంట్లో రకరకాల పుస్తకాలు. అర్థశాస్త్రం, చరిత్ర, ఇంగ్లీషు, ఇంకా వైద్య గ్రంథాలు చదివేవాడిని. నేను నిజమైన చదువును తెలుసుకున్నది ఆ సమయంలోనే.

ఒక ఒరవడిలో మనం కొట్టుకు పోతున్నపుడు మన అనుభవంలోకి వచ్చే సంఘటనలన్నీ ఒక్కలాంటివే అవుతాయో, లేక మనం అన్ని విషయాల్ని ఒక్కలాగే

ట్రీట్ చెయ్యడం వలన అలా అవుతాయో గాని, నేను ప్రతి పనినీ ఆదర్శవంతంగా, నిజాయితీగా చెయ్యడానికి ఇష్టపడేవాడిని. అప్పుడొక విచిత్రం జరిగింది. అఫ్‌కోర్స్.. అది నా జీవితాన్నొక మలుపు తిప్పిందనుకో. నేను డిగ్రీ పరీక్షలు పూర్తిచేసిన తర్వాత మరి నలుగురు స్నేహితులతో కలిసి 'ఒనకఢిల్లీ' పిక్‌నిక్ వెళ్ళాం."



చలిగాలి రివ్వున తాకింది. ఆయన అందుబాటులో ఉన్న దుప్పటిని లాగి కప్పుకున్నారు. అదే దుప్పటిలో మురళి, మాధవి ఒదిగిపోయారు. కొబ్బరి ఆకులు కదులుతున్న శబ్దం తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది. అప్పటివరకు తను కప్పుకున్న శాల్‌ను నా మీదకు విసిరారు. 'కమాన్ డాడీ' అంది మాధవి ఉత్సుకతను ఆపుకోలేక. ఆయన తిరిగి గొంతు సవరించుకుని చెప్పడం మొదలు పెట్టారు.

"పిక్‌నిక్‌కని వెళ్ళామని చెప్పాం కదా! అక్కడకు దగ్గరలో 'వాటర్ ఫాల్స్' ఉన్నాయంటే బయల్దేరాం. అద్భుతమైన జలపాతం. మసకచీకటి పడుతుండడం వలన ఆ రాత్రి అక్కడే ఉండి ఉదయమే ఫోటోలు తీసుకుని వెళ్ళిపోదామని నిర్ణయించుకున్నాము. అక్కడకు దగ్గరలో ఉన్న గవర్నమెంట్ గెస్ట్‌హౌస్‌లో రూమ్ దొరికింది. గెస్ట్‌హౌస్‌లో మాకు పక్కరూమ్‌లోని రవీన్‌తో పరిచయమైంది. అతను బెంగాలీ. మమ్మల్ని ఆ రాత్రి దగ్గరలో ఉండే జాతరకు రమ్మన్నాడు. మిగతా నలుగురూ రాలేమన్నారు. నేను, రవీన్ కలిసి బయలుదేరాం. అంతటి అందమైన దృశ్యం నేనంతకు ముందు గాని, ఆ తర్వాత గాని చూడలేదు. చుట్టూ ఎత్తైన కొండలు, మధ్యలో విశాలమైన మైదానం, కాగడాల వెలుతురు నల్లగా, మొరటుగా ఉన్న మనుషుల ముఖాలకు బంగారు రంగును పులుముతోంది. బృందగానాలు, వింత వింత ఆటలు, ఆ ప్రదేశం కోలాహలంగా ఉంది. నేను ఆ ఆనందంలో ఉండగా, అప్పుడు జరిగింది అనూహ్యంగా ఆశ్చర్యం, సిగ్గు కలిగించే విషయమొకటి. ఒక్కసారిగా ఎవరిదో భయంకరమైన ఆర్తనాదం వినిపిస్తే వెనక్కు తిరిగాను. అక్కడ నాకు కనిపించిన దృశ్యం హృదయవిదారకంగా ఉంది. సుమారు పద్నాలుగు సంవత్సరాల వయస్సున్న అమ్మాయిని ఒక వ్యక్తి బలవంతాన ఈడ్చుకుపోతున్నాడు. మిగతా వారంతా వినోదంగా చూశారు. ఆపడానికి ఎవరూ ప్రయత్నించక పోగా బుద్ధిగా ఉండమని ఆ అమ్మాయికి చెప్పసాగారు. వాళ్ళ భాష తెలుగే అయినా, నాకు సరిగ్గా అర్థం కాలేదు. ఆ అమ్మాయి గుండెలు పగిలేలా, రోదిస్తూనే ఉంది. ఈ లోగా ఆ అమ్మాయి తండ్రి గాబోలు దగ్గరగా వచ్చాడు. అంతే, పట్టుకున్న చేతిని బలంగా కరిచి విదిలించుకుని తండ్రి కాళ్ళకు బలంగా చుట్టుకొని వెక్కి వెక్కి దీనంగా ప్రార్థిస్తూ ఏడవసాగింది. ఆ అమ్మాయి తండ్రి ఓదార్చలేదు సరి కదా, ఈడ్చుకు వెళ్ళి ఆ వ్యక్తికి అప్పగించి కోపంగా గట్టిగా ఏదో అరిచాడు. ఆ అమ్మాయి గమ్మునుండిపోయింది. నిశ్శబ్దంగా తండ్రివైపు వెగటు, అసహ్యం వ్యక్తపరుస్తూ చురుగ్గా చూసింది. తర్వాత చుట్టూ చూసింది. ఎందుకో ఒక్కక్షణం నా వైపు ఎక్కువసేపు చూసినట్లు నాకనిపించింది. ఆ చూపులు ఎంత జాలి గా ఉన్నాయంటే.. నాకిప్పటికీ తలచుకున్నప్పుడల్లా ఒంటరిగా ఓ మూల కూచుని ఏడవాలనిపిస్తుంది. తర్వాత జుగుప్సతో కూడిన ఓ చూపును విసిరి ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.. కాదు కాదు ఈడ్చుకుపోబడింది.

నాకు ఉద్రేకంగా ఉంది. ఏదో ఘోరం జరుగుతుంది. అదేమిటో నాకు తెలియటం లేదు. అక్కడ ఇంకా అదే వయసులో ఉన్న కన్నెపిల్లలు చాలా మంది ఉన్నారు. వాళ్ళంతా తెల్లగా పాలిపోయినట్టయిపోయారు. వాళ్ళ ముఖాలన్నీ జీవితంలో నవ్వు, ఆనందం అంటే ఏమిటో తెలీనట్లు అయిపోయాయి. నేను ఆగలేక ప్రక్కనున్న వ్యక్తిని అడిగాను ఏమైందని? అతను చెప్పింది విన్నాక నా మెదడంతా మొద్దుబారిపోయింది. జీవితంలో ఇటువంటివి జరుగుతాయని విన్నా, చదివినా నేను నమ్మకపోదును. కాని విన్నది, చూసింది స్వయంగా నేనే."

ఆయన ముఖంలోని ఉద్రేకం వెన్నెల్లో స్పష్టంగా కనబడింది. నేను కళ్ళు మూసుకున్నాను. నా చెక్కిట జారిన కన్నీరు అదృష్టవశాత్తూ వెన్నెల నా మీద పడక పోవడం చేత ఎవరికీ కనిపించ లేదు. ఆయన ఎక్కువ ఉద్రేకపడిపో యారు. "ఇది నిజమా, నిజంగానే ఇలా జరిగేదా" అంటూ ముందుకు వంగి నా చేతిని పట్టుకున్నారు. ఆ చెయ్యి చిన్నగా వణుకుతోంది. నేను మృదువుగా ఆయన చేతిని నిమిరాను. తిరిగి ఆయనే ఊరటపడి "అలా జరిగే దని చెప్పడానికి నా జీవితమే ఉదాహరణ" అన్నారు. పిల్లలు ఆతృత అణచుకోలేక పోయారు. మాధవి నా చేతిని గట్టిగా పట్టుకుంది. తిరిగి ఆయన స్వరం నిశ్శబ్దంలో వాక్యాల్ని సృష్టించ సాగింది.

"ఇంతకూ అక్కడ జరిగిందేమిటంటే, ఆ అమ్మాయిని ఆ వ్యక్తి కొనుక్కున్నాడు... ఎస్.. ఇట్ వజ్ ట్రూ.. జస్ట్‌లైక్ ఎనిమల్స్.. అమ్మింది స్వయానా ఆ పిల్లతండ్రే! నేను నమ్మలేదు. ఆయన్ని గుచ్చి గుచ్చి అడి గాను. ఆయన నా వైపు చూసి వెళ్ళి పోయాడు".

మురళి ఉలిక్కిపడ్డాడు. మాధవి భయంగా నా వైపు చూసింది. బాబాయిగారు నిద్రలో కదలసాగారు.

ఒకసారి ఆయన వైపు చూసి తిరిగి చెప్పసాగారు.

"ఇది అక్కడ మామూలేనట. కన్నెపిల్లలున్న తండ్రి ఏడాదికొక పర్యాయం జరిగే ఈ జాతరకు తీసుకువచ్చి సరియైన వెలను చూసుకుని అమ్ముకుంటాడు. అక్కడ ఇంకా చాలామంది కన్నెపిల్లలున్నారు. తిరిగి జాతర కోలాహలం మిన్నుముట్టసాగింది. నేనేదైనా చేసి ఆపుదామనుకున్నాను. అక్కడ ఉన్న అందరినీ నేను ఏమీ చేయలేను. వెంటనే గెస్టుహౌస్‌కు బయలుదేరాను. నా మెదడులో ఆలోచనలు ఎర్రగా కాలిన కొలిమిలోని నిప్పురవ్వల్లా ఎగసి పడుతున్నాయి. ఇది సాధ్యమా? ఎందుకు వీళ్ళు ఇంత మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారు? జంతువు కూడా పిల్లలు దూరమైతే తల్లడిల్లిపోతుందే, మరి వీళ్ళేమిటి ఇలా.. ఎంత జాలిగా చూసిందా అమ్మాయి. ఆ చూపులు ఎంతదూరం పోయినా వెనుక నుంచి సూటిగా గుచ్చుకుంటున్నాయి. కాని, ఆ తండ్రి కళ్ళల్లోని కసాయితనం కొద్దిగానైనా కరుగలేదే.. అక్కడ అమ్మాయిలంతా శిలల్లా నించున్నారు. ఇంత విశాలమైన ప్రపంచముండే, కాని వీరు కూపస్థమండూకాల్లా ఇలా మ్రగ్గిపోతారేమిటి? ఒక్కరికీ అయ్యోపాపం అనాలని అనిపించలేదా? నాకే కనుక విపరీతమైన శక్తి ఉంటే కన్నెపిల్లల్ని స్వార్థానికి అమ్ముకుంటున్న తండ్రులందర్నీ నాశనం చేసేద్దును. నాకు సంబంధించిన వాళ్ళు ఎవరూలేరు అందులో. అయినా నేను భరించలేకపోయాను. బానిసల్లా కనిపించని బంధనాలతో "మమ్మల్ని ఎవరైనా రక్షించండి బాబూ" అంటూ దీనంగా చూస్తున్న అక్కడి అమ్మాయిలు జ్ఞాపకానికొస్తున్న కొద్దీ నాలో దుఃఖం పెల్లుబక సాగింది. ప్రక్కనే ఉన్న బండ మీద కూర్చొని ఆ అర్థ రాత్రి నేను ఏడ్చాను. దేవుణ్ని ప్రార్థించాను. ప్రకృతిని తిట్టాను. నన్ను నేను మరచిపోయి ఉన్మాదిలా అక్కడ ఉన్న రాళ్ళను చెట్లకు వేసి కొట్టాను."

ఆయన పెదవి వణకడం వెన్నెల్లో స్పష్టంగా కనిపించింది. మురళి, మాధవి ఊపిరిని కూడా నిశ్శబ్దంగా పీలుస్తున్నారు. వెక్కి వెక్కి ఏడుపు వినిపిస్తే పక్కకు తిరిగి చూశాం. బాబాయిగారు ఎప్పుడు లేచారో తెలీదు. చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తున్నారు. ఏడుస్తూనే చెప్పసాగారు.

"నా మీద దేవుడిది ఎంత చిన్నచూపు. నువ్వు నాకు కనిపించడం ఒక్క ఏడాది ముందు జరిగి ఉంటే నా చేతుల్లో పెరిగిన నా కన్నకూతుర్ని పోగొట్టుకోక పోదును. దాన్ని అమ్ముకుని నేను ఏం బావుకున్నాను. అమ్ముకున్న వారానికే దాని చావు వార్త విన్నాను." అంటూ రోదించారు. చేసిన తప్పు కొట్టిన దెబ్బలకు మనసు కార్చిన కన్నీటిబొట్లు ఈ రోజు వెలుపలకు వచ్చేస్తున్నాయి. ఆయన పూర్తిగా సేదదీరే వరకూ మేమెవ్వరం మాట్లాడలేదు. తిరిగి మా వారు మొదలెట్టారు.

"మీకు నారాయణ పడాల్‌గారు ఎవరన్నదానికి సమాధానం చెప్పలేదు కదూ! నేనా అర్థరాత్రి త్రోవ తప్పాను. రెండుగంటలు ప్రయాణం చేసినా సరే, బంగళా రాలేదు. బంగళా నుంచి జాతరకు అరగంట సుమారు నడక. చుట్టూ దట్టమైన అడవి. ఒంటరితనం. భయమేసింది. ఈలోగా ఒక చిన్న ఎడ్లబండి అటుగా రావడం కనిపించింది. నేను ఆ బండిలోని వ్యక్తిని సహాయం అడిగాను. వెనుక నుంచి ఒక వ్యక్తి క్రిందకు దిగాడు. అతడు జాతరలో నాకు సమాధానం చెప్పిన వ్యక్తే. నేను చెప్పినదంతా విని త్రోవ తప్పినట్లుగా నిర్ధారించి, ఇప్పుడు బంగళాలో వెళ్ళడం కష్టమని, తమతో పాటు గూడేనికి రమ్మని ఉదయాన్నే బంగళాకు దిగబెడతామని చెప్పాడు. నేను బండి ఎక్కాను."

నాకు చప్పున ఆ అర్థరాత్రి ఆయన బండిఎక్కడం జ్ఞాపకం వచ్చి ఉంటుంది. నన్ను చూసి నవ్వారు. నేను సిగ్గుగా తల వంచుకున్నాను. ఆయన తిరిగి కొనసాగించారు.

"ఆ వ్యక్తే ఈయన. నారాయణ పడాల్‌గారు. ఈయనతో పాటు బండిలో ఒక అందమైన అమ్మాయి ఉంది. అంటూ ఆయన నా వైపు చిలిపిగా చూశారు." పిల్లల ముందు తెలిసిపోవడం నాకిష్టం లేక ఆయన వైపు వేడుకోలుగా చూశాను.

"ముందున బండి తోలుతున్నది ఆ అమ్మాయి తండ్రి అని తర్వాత తెలిసింది. కొద్దిసేపట్లోనే నేను పడాల్‌గారితో మాటల్లో పడిపోయాను. నీరు మంచుముక్కగా మారుతున్నప్పుడే మరలా వేడి తగిలితే.. నేను దేనికైతే అమిత ఉద్రేక పడ్డానో అదే మరల వినవలసి వచ్చింది... ఆ అందమైన అమ్మాయిని కూడా జాతరకు తీసుకువచ్చారట. సరియైన వెల కుదరక తిరిగి తీసుకు వెళ్ళి పోతున్నారట. ఆ మాట వింటున్నపుడు ఆ అమ్మాయి కళ్ళల్లో తృటిలో తప్పిన దురదృష్టం వలన కలిగిన ఆనందం తళుక్కున మెరిసింది. నేను పడాల్‌గారితో విపరీతంగా వాదించాను. ఎన్నోరకాల ఉదాహరణలు చెప్పాను. చివరకు ఆయన కోపానికి కూడా గురి అయ్యాను. కాని, నేను వాళ్ళను కన్విన్స్ చెయ్యలేకపోయాను. నాలో ఉత్సాహం పూర్తిగా చచ్చిపోయింది. తిరిగి నాలో ఉత్సాహం, ఆశ మొదలైంది గూడానికి చేరుకున్న తర్వాతనే" అంటూ ఆయన ఒక్క క్షణం ఆగారు. నాకు అమ్మ జ్ఞాపకానికొచ్చింది. నా కోసం రోదించడం జ్ఞాపకానికొచ్చింది.

"తిరిగి వచ్చిన కూతురుని చూడగానే తల్లి కళ్ళల్లోని ఆనందం కన్నీరుగా వెలువడింది. ఆ కన్నీటి బిందువుల్లో వెన్నెల రేఖ చొచ్చుకుపోయి వింత మెరుపునిచ్చింది. తర్వాత కొండలన్నీ జలదరించేలా ఆనందంగా నవ్వింది. కూతురుని పట్టుకొని మాతృప్రేమను వ్యక్తపరుస్తూ భోరుమని విలపించింది. మగవాళ్ళిద్దరూ ఏం పట్టించుకోకుండా పక్కకు వెళ్ళిపోయారు. నేనొక నిర్ణయానికొచ్చాను. ఉదయం లేవగానే ఆ అమ్మాయి వెల చెప్పమన్నాను. మొదట ఆశ్చర్యపడ్డా వాళ్ళు చెప్పారు. ఒక నిండు జీవితం వెల ఎంతో తెలుసునా? కేవలం ఎనభై రూపాయలు. మనకు ఇప్పుడు ఎనభైరూపాయలంటే ఏమీ కాకపోవచ్చు కాని ఇరవై సంవత్సరాల క్రితం, అదీ ఆ మారుమూల కొండల్లో ఎనభై రూపాయలకి చాలా విలువంది. అదృష్టవశాత్తు అప్పుడు నా దగ్గిర డబ్బులు ఉన్నాయి. ఫలితంగా ఆ అందమైన అమ్మాయి (బాసంతి) ఉదయాన్నే నాతో పాటు బంగళాకు,తర్వాత ఈ ఇంటికి వచ్చింది."

"నేనూ, మా లెక్చరర్‌గారు కలిసి కొన్ని వారాలు సుదీర్ఘంగా ఆలోచించాం. ఆలోచనను నేను అమలులో పెట్టాను. ముందుగా నేను మరల బాసంతితో గూడానికి వెళ్ళాను. అక్కడ ఉన్న యువకులకు నేనంటే ఉన్న బెరుకుతనం పోగొట్టి చనువు చేసుకున్నాను. బంధువుగా నాకది సాధ్యమైంది. అలా రెండు మూడు పర్యాయాలు గడిచిన తరువాత, ఓ పదిమంది యువకులను, ఐదుగురు పెద్దవాళ్ళను పడాల్‌గారితో సహా, బాసంతి, నేను బలవంతాన ఒప్పించి వైజాగ్ తీసుకొచ్చాం. ఇక్కడ మా లెక్చరర్‌గారితో వాళ్ళ మెదడు రోజూ తోమించడం మొదలుపెట్టాం. తరువాత ఐ.టి.డి.ఎ అధికారులతో వాళ్ళ కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలు చెప్పించాను. ఇంకా వ్యవసాయ పరిశోధనాశాలకు తీసుకువెళ్ళి, అక్కడ శాస్త్రజ్ఞులతో కొండలపై పండే రకరకాలైన లాభసాటి పంటలను గూర్చి, సహకార సంఘాలను గూర్చి చెప్పించాం. బ్యాంక్ మేనేజర్లను కలిసి ప్రభుత్వం రూపొందించిన రకరకాల లోన్‌లను గూర్చి, ఉపాధి అవకాశాలను గూర్చి.. ఇంకా పట్టణంలోని రోటరీక్లబ్ వారితోనూ, సేవాసంఘాల వారితోనూ చెప్పించి వాళ్ళను ఉక్కిరి బిక్కిరి చేశాం. కానీ, మేము వాళ్ళ ఆచారాలను గూర్చి, కన్నెపిల్లల్ని అమ్ముకోవడం గురించి అసలు మాట్లాడలేదు. వాళ్ళు వెళ్ళిపోయారు".

"తర్వాత నేను చెబుతాను" అన్నారు అప్పటివరకూ మౌనంగా ఉన్న పడాల్‌గారు.

"అక్కడనుంచి వచ్చిన తరువాత మా బ్రతుకుపై మాకు చికాకు వేసింది. పట్టణ నాగరికత కలలో కూడా ఊహించలేదేమో మా యువకులంతా విపరీతంగా ఆశ్చర్యపోయారు. వాళ్ళంతా ఎప్పుడూ ఆలోచిస్తూనే ఉండేవారు. వాళ్ళకు ఈ పథకాలు, అభివృద్ధి ఎంతో అందుబాటులో కనిపించి ఉక్కిరి బిక్కిరి అయిపోయారు. కొత్త జీవితం కోసం ఆశపడ్డారు. రోజూ నన్ను నీవు ఎప్పుడు వస్తావు అని అడిగేవారు. నీ కోసం వాళ్ళు ఎంతగా ఎదురు చూశారంటే ప్రతిరోజూ ఒకడు నీ కోసం బస్సు దగ్గరకు వచ్చేవాడు. నువ్వు రెండు నెలలు పోయాక మా బాసంతితో కూడి వచ్చావు. మొదట మేం మా బాసంతిని పోల్చుకోలేదు. తర్వాత నీకు తెలిసిందే. ప్రభుత్వం మాకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలు నీ దయ వలన మమ్మల్ని అభివృద్ధి చేశాయి. రకరకాల పంటలతో, సహకార సంఘాల సహకారంతో డబ్బు సంపాదించడం తెలియడంతో పాటు విజ్ఞానాన్ని కూడా పెంచుకోగలిగాం. నీ సహాయం తో మేమేం చెయ్యాలో, ఎలా చెయ్యాలో తెలుసుకున్నాం. మాకు ఎవరూ చెప్పకుండానే మా ఆచారాల్లోని తప్పులు తెలిసాయి. మీ నాగరికతకు ఆకర్షితులమై అనుకరించడం మొదలుపెట్టాం" అంటూ పడాల్‌గారు ఆగారు.

"తర్వాత రెండు సంవత్సరాలకు నాకు ఆగ్రాలో ఉద్యోగం రావడంతో వ్యవహారాలను ఎలా చూసుకోవాలో వివరంగా పడాల్‌గారికి చెప్పి వెళ్ళిపోయాము. తిరిగి ఇదిగో దైవికంగా ఈ రోజు ఇలా కలిశాము. నాకు ప్రత్యక్షమైన అభివృద్ధి ఏమిటంటే శ్రీ నారాయణ

పడాల్.. మెట్రిక్., మా బాసంతి బి.ఎ.... ఆ బాసంతియే ఈ ఇంతి ప్రసన్న" అన్నారు మావారు నన్ను చూపుతూ.

ఆ రాత్రి మేమెవ్వరం నిద్ర పోలేదు. ఎంత చెప్పినా సంగతులు ఇంకా మిగిలిపోయేవే.

అలా చెప్పుకుంటూనే ఉన్నాం.

* * *

**త**రచుగా గూడెం నుంచి ఎవరో ఒకరు వచ్చి కలుస్తూనే ఉండేవారు. నేను గాని, ఆయన గాని గూడెనికి వెళ్ళడానికి సరియైన సమయం చిక్కలేదు. చూస్తుండగానే పది సంవత్సరాలు గడిచిపోయాయి. పదో సంవత్సరం ముగుస్తూ నా నుదుటి బొట్టును తుడిచి వేసింది. మురళి ఐ.టి.డి.ఎ. అధికారిగా ఏజన్సీకి వెళ్ళాడు. మాధవికి మూడు సంవత్సరాల క్రితమే పెళ్ళయి ఇప్పుడు ఢిల్లీలో ఉంటోంది. నేను ఒక్కర్తెనూ మిగిలిపోయాను. సంఘటనల్ని నెమరు వేసుకుంటూ నిర్జీవంగా రోజులు గడిపేస్తున్నాను. ఒకరోజు మురళి దగ్గర నుంచి నాకొక ఉత్తరం వచ్చింది.

* * *

"**అ**మ్మా!

నాన్నగారు ఒకసారి చెప్పారు జ్ఞాపకం ఉందా! ప్రతి వ్యక్తి ఎవరో ఒకరి ప్రభావానికి గురవుతాడని. ఒక వ్యక్తిని ప్రభావితం చెయ్యగలిగిన వాడు గొప్పవాడు అయితే వందలమందిని ప్రభావితం చేసినవాడు మహానుభావుడంటే ఒప్పుకుంటావా!

రెండురోజుల క్రితం పడాల్‌గారి అబ్బాయి నన్ను వాళ్ళ ఊరు తీసుకు వెళ్ళాడు. అక్కడ నాకు ఆశ్చర్యాలకు అంతే లేదు. ఊరికి మధ్యలో నాన్నగారి శిలావిగ్రహం ఉంది. నన్ను చూసిన వాళ్ళ కళ్ళలో ఆనందం ఉప్పొంగడం నేను గమనించాను. నాకు బ్రహ్మరథం పట్టారు. నన్ను వారి ఆప్యాయతతో ఊపిరి ఆడకుండా చేశారు. అక్కడ ఏజన్సీలో ఏ ఊరిలోనూ లేనంత చైతన్యం ఉంది. వీథులన్నీ పట్టణాల్లో వీథులకు దీటుగా ఉన్నాయి. ఇంకా అక్కడి అద్భుతమేమిటంటే నాన్న అక్కడికి వచ్చినపుడు ఉండే గుడిసెను, మంచాన్ని, వాడిన ప్రతి వస్తువును ఎంతో జాగ్రత్తగా భక్తితో భద్రపరిచారు.

స్కూలు రిజిష్టరులోని పేర్లలో ఎక్కువగా శ్రీరామ్ పేర్లే ఉన్నాయి. అక్కడ ప్రతి వీథిలోనూ పదిమందికి తక్కువ గాకుండా శ్రీరామ్‌లున్నారమ్మా! ఇంకా శ్రీరామ్ మార్గం, శ్రీరామ్ జనరల్ స్టోర్స్, శ్రీరామ్ మెడికల్ స్టోర్స్, శ్రీరామ్ ఆసుపత్రి, శ్రీరామ్ ఆరామ మందిరం.. ఇలా ఎక్కడ చూసినా నాన్నగారి పేరు మారుమ్రోగుతోంది.

ఆ రోజు రాత్రి నేను రిజిష్టర్‌లో విజిట్ చేసిన ఊరి పేరు కాలమ్‌లో రాసిన పేరేమిటో తెలుసా అమ్మా... శ్రీరామ్‌పురం!

* * *

నాకు కళ్ళ నిండా నీరు కమ్మేయడంతో అక్షరాలు కనిపించలేదు. కాని నేనేం చెయ్యాలో కనిపించింది. రెండురోజుల తర్వాత నేను 'ఒనకఢిల్లీ' నుంచి నా గమ్యానికి చేర్చే బస్సులో ఉన్నాను. బస్సు ముందున్న బోర్డు మీద నల్లగా మెరుస్తున్న అయిదక్షరాలు ఉన్నాయ్... శ్రీరామ్‌పురం! ❐

# సాంఘిక సంక్షేమ గృహాల ప్రక్షాళనకై పూనం కృషి

**ని**ర్లక్ష్యానికి, నిరాదరణకు గురవుతూ శిథిల కేంద్రాల వలె కనిపించే సాంఘిక సంక్షేమ వసతిగృహాలలో నూతన వెలుగులు ప్రసరింపచేసిన ఘనత గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి ఎం. పూనం మాలకొండయ్యకు దక్కుతుంది.

జిల్లాలో గల 188 సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో, 15 మంది సహాయ సాంఘిక సంక్షేమ అధికారుల పర్యవేక్షణలో సుమారు 17 వేల మంది విద్యార్థులు విద్య నభ్యసిస్తున్నారు. ఈ వసతి గృహాల యాజమాన్యం పలు అవకతవకలకు నిలయం కావడం, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం చాలా తక్కువగా ఉండడం, పరిసరాలు చాలా అనారోగ్యంగా ఉండడం, మంచినీరు, వైద్య సహాయం, కనీస సౌకర్యాలు కూడా బహుదూరం కావడం అందరూ ఎరిగినదే. బలహీన వర్గాలకు చెందిన, ఆర్థికంగా వెనుకబడిన ఈ విద్యార్థులు సహితం సరయిన పరిసరాలు, సౌకర్యాలు కల్పిస్తే అద్భుత ఫలితాలు సాధించగలరని రుజువు చేయాలని ఆమె దీక్ష బూనారు.

ఈ వసతి గృహాల పరిస్థితిని మెరుగు పరచడానికి ఆమె నాలుగు ప్రధాన చర్యలు చేపట్టారు. విద్యార్థులందరికీ మంచి చదువు, శారీరక- మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపడం, వసతి గృహాలలో సౌకర్యాలు మెరుగు పరచడం, ఆహార పదార్థాలు పంపిణీ క్రమబద్ధం చేయడం, సమర్థవంతమైన పరిపాలన ఏర్పరచడం వంటి చర్యలు ప్రారంభించారు.

నైతిక విలువల పట్ల ఆసక్తి కల్గించడానికై, ప్రతిరోజూ ఉదయం ప్రార్థన సమయంలో అధికారి ద్వారా నీతి వాక్యాలు, నీతికథలు, సూక్తులు తెలిపే పద్ధతి ప్రారంభించారు. దీని ద్వారా అధికారులు, పుర ప్రముఖులు వసతిగృహాలకు వస్తూండడం, అక్కడి పరిస్థితులను గమనించడం ప్రారంభమయింది. ఆ విధంగా సందర్శించిన అధికారి ప్రార్థనా కార్డుపై సంతకం చేస్తారు. ఆ కార్డులన్ని ప్రతి నెలా మొదటివారంలో జాయింట్ కలెక్టరుకు చేరుతాయి.

విద్యార్థుల చదువు, వారి మార్కులు నమోదు చేసి 'విద్య ప్రమాణ గుర్తింపు కార్డు' లలో వివరాలు నమోదు చేసే బాధ్యత వార్డెన్లకు అప్పచెప్పారు. వార్డెన్లు, మాట్రన్లు విధిగా వసతి గృహాలలో ఉండే ఏర్పాటు చేసారు. వసతి గృహాలలో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి, 'కెరీర్ గైడెన్స్' విభాగాలు ప్రారంభించారు. ఈ విభాగాలకు పలు పత్రికలు తెప్పించి పదవ తరగతి తర్వాత అందుబాటులో ఉండే వివిధ కోర్సుల వివరాలు, ఉపాధి అవకాశాలను గురించి తెలుసుకునే అవకాశం కల్పించారు.

విద్యార్థులకు అంటురోగాలు వ్యాపించకుండా, అనారోగ్యానికి గురయితే తగు వైద్య సదుపాయం అందించడం పట్ల శ్రద్ధ చూపారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తన పరిధిలోని వసతి



గృహాలను నెలకు ఒకసారి సందర్శించి, ప్రతి విద్యార్థిని పరీక్షించ ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థికి 'ఆరోగ్య కార్డు'ను ఏర్పర్చి, వైద్యాధికారి సంతకం చేయాలని అన్నారు.

ఎస్.సి. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జిల్లాలో అన్ని సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతులను పర్యవేక్షించాలి. అయితే పరిమితమైన సిబ్బంది ఉండడంతో సంవత్సరాలు గడిచినా వసతి గృహాల భవనాల బాగోగుల గురించి పట్టించుకొనే అవకాశం లభించడం లేదు. అందుకనే రూ. 15 వేల లోపు వ్యయం కాగల మరమ్మతులను పంచాయితీరాజ్ ఇంజనీర్ల ద్వారా చేయించే అధికారాన్ని ఆర్.డి.ఓ.లకు అప్పచెప్పారు. భవనాల నిర్వహణ, అద్దె భవనాలకు అద్దె చెల్లించడం, విద్యుత్ బిల్లుల చెల్లింపులు కేంద్రీకృతం చేసి లొసుగులు నివారించారు. వసతిగృహాలకు అవసరమయిన నిత్యావసర వస్తువులు పౌరసంబంధ శాఖ ద్వారా మండల స్థాయిలోనే పంపిణీ చేసేటట్లు చేసి, అనవసరపు రవాణా వ్యయం తగ్గించారు.

ప్రతినెలా మండల రెవిన్యూ అధికారి అధ్యక్షతన మండల స్థాయి సమన్వయ కమిటి సమావేశమై ఆ మండలంలోని వసతి గృహాల పరిస్థితులను సమీక్షించే పద్ధతి ప్రవేశపెట్టారు. కమిటీలో తల్లిదండ్రుల ప్రతినిధులు కూడా ఇద్దరు ఉంటారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి విద్యార్థుల తల్లిదండ్రులను సమావేశపరచాలని ఆదేశించారు. అన్ని వసతి గృహాలకు తెల్లసున్నం వేయించి ఆరోగ్యకరమైన పరిస్థితులు ఏర్పరిచారు.

ఆ విధంగా జిల్లాలోని వసతి గృహాల స్వరూపాన్నే శ్రీమతి పూనం మార్చివేసారు. వసతి గృహాల విద్యార్థులు 50 శాతానికి తక్కువగా ఉత్తీర్ణులు కారాదని పదవ తరగతి పరీక్షలలో 60 శాతం, 80 శాతం మించి మార్కులు సాధించిన వసతిగృహాల వార్డెన్లు, ట్యూటర్లకు నగదు బహుమతులు, కలెక్టరు నుండి ప్రశంసాపత్రాలు అందగలవని ఆమె ప్రకటించారు. అంతకన్నా తక్కువ ఫలితాలొస్తే క్రమశిక్షణ చర్య తీసుకొంటామని ఆమె హెచ్చరించారు. నూరుశాతం ఫలితాలు ప్రయివేట్ విద్యాసంస్థలలోనే గాకుండా, సాంఘిక సంక్షేమ గృహాలలో కూడా సాధించగలిగేటట్లు చేయడం తన లక్ష్యమని ఆమె అన్నారు. ఈ విద్యార్థులలో కూడా పోటీ పరీక్షల పట్ల ఆసక్తి కల్గించి, వృత్తి విద్యాకోర్సులలో ప్రవేశం పొందగలిగేటట్లు చేయాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు.

- ఎ. హిమబిందు